# అమలాపురంలో అమెరికా అల్లుడు

ఎస్. లలిత.

ఆకాష్ విసురుగా వచ్చి, చేతుల్లోని ఉత్తరాన్ని సునీత మొహాన విసిరాడు......

సునీత నింపాదిగా అతని వంక చూసి ..... ఆ ఉత్తరాన్ని అందుకుంది.

" హుఁ ! తండ్రికి తగ్గ కూతురే ...... " గొణుకున్నాడు....

ఆ ఉత్తరం చదివిన సునీత ...... ' బావా ....బావా .... ఇండియా వెళ్దామా .... గారంగా అడిగింది.....

తన విసుక్కి కారణం తెలుసుకోవాలన్న ఉద్దేశ్యం ఆమెకు ఏమాత్రం లేకపోగా తనను ఆమె ఏ మాత్రం పట్టించుకోలేకపోవటంతో మరింత బిగుసుకుపోయాడు ఆకాష్.....

" ఏంటి ..... బావా ఆ అలక. అనకాపల్లి బెల్లంలా అలా బిగుసుకున్నావేమిటి అని రాగాలు తీసింది.

" అదిగో ఆ పోలికలే వద్దు.... నీకు మీవాళ్ళలాగే అంతా పల్లెటూరి మాటలు " అక్కసు బయటపెట్టాడు. సునీత నవ్వింది . ..... భర్త కోపానికి కారణం అర్థమయింది.......ఎందుకు బావా .... మా నాన్నని దెప్పుతావు.......ఇంతదూరంలో ఉన్నా ....మర్చిపోకుండా మనల్ని రమ్మని లెటర్ వ్రాశాడు మన పెళ్ళయ్యాక వచ్చిన మొదటి పంట అసలు సంక్రాంతి సంబరాలు మన ఊళ్ళోనే చూడాలి......గొబ్బెమ్మలు రంగు రంగుల ముగ్గులు ...... బొమ్మల పేరంటాలు హరిదాసు పాటలు " అంటూ నాన్‌స్టాప్‌గా ఉదరగొట్టడం మొదలెట్టింది. ఆమె ఉద్దేశ్యం తన ఎడబాటుని తట్టుకోలేక ఆకాష్ అలిగాడెమో అని....

" చాల్లే ఆపు.... అసలు ఆ ఉత్తరం మీద అడ్రస్ చూశావా ...... " కొంచెం వ్యంగ్యంగా అప్పుడు సునీత కవర్ వి ంద ఎడ్రస్ చూసింది. తాటికాయంత అక్షరాలలో అచ్చ తెలుగులో ఉంది.....

అదృష్టం కొద్దీ ...... ఆకాష్ ఆఫీసు పేరు ....యు.ఎస్.ఏ అన్నవి ఒంకరటింకరగా ఉండబట్టి వాళ్ళకి చేరింది.

" అందుకా ..... దొరగారికి కోపం ..... పాపం మా నాన్నకి ఇంగ్లీషు రాదు .ఏం చేస్తాం

..। అయినా చేరాల్సిన టైమ్‌కే చేరింది " అంది.

" ఆ ఉత్తరం చూసి మా స్టాఫ్ ఎంత ఆటపట్టించారో తెలుసా... ఆఫీసు మొత్తంలో తెలుగువాణ్ణి నేనే కావటం వల్ల నా మొహాన పారేసి , ఏ భాషలో ఉందదని చుట్టూ మూగిపోయారు. నాకెంత ఇన్‌సల్టింగ్‌గా అనిపించిందో ..... " కోపంగా అన్నాడు.

" పోన్లేద్దూ! వాళ్ళేమనుకుంటే ఏం.... ఇంకోళ్ళ కోసం మన సంస్కృతి, సంప్రదాయం మర్చిపోతామా .... " తండ్రిని సపోర్టు చేసింది.

పెళ్ళై ఏడాది కావస్తున్నా , అస్సలు మారని భార్యామణిని నోరుతెరుచుకుని చూస్తూండిపోయాడు ఆకాష్.

******* ******** ****** ********

సునీతకి మరీ ఆనందంగా ఉంది ....ఇండియా వెళుతున్నందుకు. ఆకాష్ రానన్నా అతన్ని ఒప్పించింది. అయితే అతను పండుగ టైమ్‌కి వస్తానని, ముందు ఆమెని మాత్రం వెళ్ళమని టికెట్ చేతుల్లో పెట్టాడు.....

పుట్టిల్లు చూస్తుందన్న ఆనందంలో ఎగిరి గంతేసింది ఆమె. ఆకాష్ వాళ్ళుండేది ఫిఫ్తు ఫ్లోర్‌లో.

ఒలంపిక్ లెవల్లో ఆమె చేసిన జంప్‌కి ఒక్కసారి నేల అదిరింది...... క్షణాల్లో క్రిందవాళ్ళు వచ్చేస్తారు.......

ఆకాష్ వణకటం ప్రారంభించాడు .... కింద ఇంటి వాళ్ళు వస్తూనే ..... తమ నెత్తి మీద సుత్తితో బాదినంత గట్టిగా చప్పుడు చేసినందుకు ..... షూట్ చేస్తామని ఇంగ్లీషులో వార్నింగిచ్చారు.......

ఆ తతంగాన్ని వింతగా చూస్తున్న సునీతతో " ఇదంతా నీ వల్లే " అంటూ వాళ్ళందరి దగ్గర క్షమాపణ అడిగాడు....చూడు సునీత ..... ఇది అమెరిక .. అమలాపురం కాదు... నీ కెన్ని సార్లు చెప్పాను.... గెంతులెయ్యవద్దని...... ఇవాళ ఆదివారం కాబట్టి అంతా ఇంట్లోనే ఉన్నారు..... ఇప్పుడు వాళ్ళు గనక కోర్టుకి వెళితే .... మన ఆస్థంతా అయ్యేదాకా నిద్రపోరు " విసుక్కున్నాడు ఆకాష్ " ఛా ఏం అమెరికా .... ఏం స్వేచ్ఛ ..... " తిట్టుకుంది సునీత....

***** ******** ***** ****

సునీతని ఫ్లైట్ ఎక్కించి వచ్చాక , అస్సలు ఏమీ తోచలేదు ఆకాష్‌కి.

పల్లెటూరిలో పుట్టి , పెరిగినా సునీత డిగ్రీ వరకు చదువుకుంది.. అందంగా ఉంటుంది.... అందుకే ఆకాష్ ఫొటో చూసే పెళ్ళి ఒప్పేసుకున్నాడు...

పెళ్ళయ్యాక మారకపోతుందా అన్న ధీమాతో మూడు ముళ్ళు వేసేశాడు.ఇప్పుడు ఆమె లేకపోతే ఇల్లంతా చిన్నబోయినట్టనిపించింది...... తను ఓ వారం రోజుల ముందెళ్ళి భార్యను సర్‌ప్రైజ్ చేయాలనుకున్నాడు..

వెంటనే ప్రయాణం పెట్టుకున్నాడు.....

** *** ***** ***** ******

ఏం కబురూ ....కాకరకాయ లేకుండా ఊడిపడ్డావేంటి " తండ్రి కొడుకుని అడిగాడు.

" అదేంటండీ ..... అబ్బాయి పెళ్ళైయ్యాక మొదటిసారి వస్తే.... ఎందుకొచ్చావంటారు " సాగదీస్తూ అంది తల్లి......

" ఆఁ .... మనకోసం కాదులే అక్కడ వదిన ఏమి ఆర్డర్ వేసిందో " టీజింగుగా అంది చెల్లెలు స్వప్న....

ఆకాష్‌కి చెల్లెలు అలా అనేసరికి ఉక్రోషం వచ్చి ..."ఉండు నిన్నేం చేస్తానో" అంటూ వెంటబడ్డాడు......

వాళ్ళిద్దరినీ అలా చూసి తల్లితండ్రులు నవ్వుకున్నారు. ఆకాష్ మొదటగా హైదరాబాద్ వచ్చాడు .... తన మనస్సులో మాట స్వప్నకి చెప్పాడు..... అంతే తన టైపులో ఓ ప్లాన్ తయారు చేసింది...... వదిన్ని సర్‌ప్రైజ్ చెయటానికి అన్నగారికి ట్రైనింగ్ ఇచ్చింది.

ఆకాష్ ఇంటర్ అవుతునే స్టేట్స్‌కి వెళ్ళిపోయాడు అక్కడే ఇంజనీరింగ్ , ఎం.ఎస్ చేసి ఉద్యోగం చేస్తున్నాడు.

అందుకే పల్లెటూళ్ల గురించి అస్సలు తెలీయదు.....చెల్లెలి ప్లాన్ అమలు చేసే ప్రయత్నంలో,ఆ మర్నాడు హైదరాబాద్ టు అమలాపురం డైరెక్ట్ బస్సెక్కాడు.

ఆకాష్ ఊళ్ళో దిగేసరికి .... ఉదయం ఆరు గంటలవుతోంది ... చలిగా అనిపించింది.... స్వెట్టర్ వేసుకుని బస్సు దిగాడు.... రోడ్డు మీద నుంచి ...... సునీత ఇంటికి నడిచే వెళ్ళాలి.

ఎప్పుడో చిన్నప్పుడు చూశాడు ఆ ఊరిలో ....... మంచు సన్నగా కురుస్తోంది.

ధనుర్మాసం కావటంతో వీధుల్లో జనం కనిపిస్తున్నారు...... ఉదయమే దైవదర్శనానికి

వెళ్తున్నట్టున్నారు.

ఎత్తుగా ....... తెల్లని హీరోలా ఆకాష్‌ని కొందరు ఎవరన్నట్టు చూస్తున్నారు.......

ఆకాష్ నెమ్మదిగా పరిసరాలు చూస్తూ నడుస్తున్నాడు. ఎటు చూసినా పచ్చటి చేలు....ఎత్తుగా కొబ్బరి చెట్లు ..... అతను ....కాస్త మనుషులు ఎక్కువగా తిరగని ప్రదేశం చూసుకుని అక్కడకు వెళ్ళాడు.

తన బ్యాగ్ తెరిచి ...... అందులో వస్తువులు తీసాడు. ఇంతలో ఎవరో ఇద్దరు చేత్తో నీళ్ళ చెంబులు పట్టుకుని అటుగా వచ్చారు.

వీళ్ళేందుకు ఇలా నీళ్ళుపట్టుకెళుతున్నారు అనుకున్నాడు ఇంతలో ఒకతను చూసి ... " ఏం బాబూ ..... ఊరికి కొత్తా ...... ఇక్కడన్నీ పంట పొలాలు తమరు కావాలంటే అలా చాటుకి వెళ్ళండి ..... " అన్నాడు.

" దేనికి?" అడిగాడు అయోమయంగా ఆకాష్ అతను నవ్వుతూ రెండు వేళ్ళు చూపించాడు...... ఛీ ......ఇంకా ఇక్కడి వాళ్ళు ఇలాగే ఉన్నారా ..... అక్కడైతే పెట్ ఆనిమల్స్ కూడా పార్కుల్లో , రోడ్లమీద ఇలాటి పని చేస్తే ఫైన్ వేస్తారు..... అతనికి వాళ్ళు వచ్చిన పని అర్థమయింది...

గబ గబా అక్కడ్నుంచి ఇంకో చెట్టు చాటుకి వెళ్ళి తన అవతారాన్ని మార్చాడు...

***** ******* ****** ****** ***

ఆకాష్ నెమ్మదిగా ఊరి చివరినుంచి ఇళ్ళున్న రోడ్డుకి వచ్చాడు........

అప్పటికే కన్నెపిల్లలు...... వాళ్ళ తల్లులు కళ్ళాపు చల్లి ముగ్గులు పెడ్తున్నారు..

ఆకాష్ వింతగా చూసుకుంటూ నడుస్తున్నాడు..... అసలే అలవాటులేని అవతారం ఇబ్బంది పెడ్తోంది.......

అలా నడుస్తున్నతనికి , ముఖపుటలకు ఓ విధమైన వాసన తగిలింది..... ఏంటా అని కిందకు చూసేసరికి ముగ్గుల మధ్య పూలతో గొబ్బిలు ఉన్నాయి......

“ ఛీ..... ఛీ..... పేడముద్దలు ...... అందుకే ఇండియా ఎకానమీ ఇలా ఉంది ..... అదే అమెరికా అయితే ఈ వి ధంగా పెంటకుప్పలు, వాకిట ముందు పెడ్తే ఫైన్ వేస్తారు అనుకున్నాడు.......

మౌనంగా నడుస్తున్న తనని ముగ్గులు వేయటం ఆపి కొందరు అమ్మాయిలు తేరిపారా చూడ్డం మొదలెట్టె సరికి ..... ఏం పాడాలో చెల్లెలు చెప్పింది గుర్తు తెచ్చుకుని

ప్రయత్నం చేశాడు.

ఎంతకీ గుర్తుకు రాక పోయేసరికి .... ఎప్పుడో చూసిన సినిమాలో పాటందుకున్నాడు.

“ హరిలో రంగ హరి ..... హరి ...... ” అంటూ అరిగిపోయిన రికార్డులా పాడుతుంటే .....చూసే వాళ్ళంతా గొ ల్లుమని నవ్వారు ....... కడుపులో భయాన్ని బయటపెట్టకుండా ...... అలాగే నాలుగడుగులు వేశాడో లేదో ..... ఓ హరిదాసు పరుగున వచ్చాడు..

“ ఏవరండీ ..... తమరు నా ఏరియాలోకి వచ్చి నాకు పోటీ వస్తారా........ ” మీద మీదకు వస్తూ అరుస్తున్నాడు.

ఆకాష్‌కి ఖంగారు, భయం కలగాపులగమై ... వణకటం మొదలెట్టాడు . అతని మౌనం , మరింత బలాన్నిచ్చింది హరిదాసుకి అప్పటి దాకా కమ్మగా పాడ్తున్నవాడు తిట్లు మొదలెట్టాడు... ఈ హంగామా దగ్గరలో ఉన్నవాళ్ళంతా చుట్టూ మూగి చోద్యం చూస్తున్నారు ..... వాళ్ళలో సునీత ముఖం కోసం ...... బిక్కచూపులు చూస్తున్నాడు ఆకాష్ ఇంతలో సన్నాయి ఊదుతూ........ బసవన్నను తీసుకువచ్చాడో వ్యక్తి.... ఎంత మూగ ప్రాణి అయినా ...... తమ ఊరి వాళ్ళెవరో పరాయివాళ్ళెవరో పసిగట్టగలదు. ఆ బసవన్న ..... ఆకాష్ వంక మిర్రి మిర్రి చూసింది.... ఎర్రటి చొక్కా మరింత ఎట్రాక్టివ్‌గా అనిపించినట్టుంది.... ఒక్కసారి కొమ్ములు విదిల్చింది కాలి గిట్టలు నేలకు తాకించి.... కట్టు వదల్చుకుని ఆకాష్ వైపు పరుగు తీసింది.

అది చూసిన ఆకాష్ “ చచ్చాన్రోయ్ ” అంటూ పరుగు ప్రారంభించాడు.....

నెత్తిమీద పెట్టుకున్న ఇత్తడి చెంబు విసిరాడు .... ఆ తరువాత చేతిలో చిడతలు వెనక్కి తిరిగి బసవన్న మీదకు వి సిరాడు.

అలవాటు లేని పంచకట్టులో ఆపసోపాలు పడ్తూ చదరంగంలో పావుల్లా ఉన్న.. గొబ్బెమ్మలను దాటుకుంటు

పరిగెట్టడం మొదలెట్టాడు...

అరగంటలో వళ్లంతా తడిసింది. ఇంకా మేనమామ ఇల్లు ఓ ఇరవై అడుగుల దూరంలో ఉందనగా ఎవరో బసవన్నను గట్టిగా ఆపారు.

ఆ విషయం తెలియని ఆకాష్ వగరుస్తూ .....కాళ్ళు మడతలు పడ్తూంటే ........ కనిపించక ఓ గొబ్బెమ్మ మీద కాలు వేసి సర్రున జారిపడ్డాడు.........

సరిగ్గా అప్పుడే సునీత ముగ్గు ముగించి , గొబ్బెమ్మలు పెట్టింది......

ఆకాష్ జారడం చూసి పరుగున వచ్చి పట్టుకుంది..... అతని కళ్ళు అప్పటికే మూతపడ్డాయి.

**** ***** ***** **** ***** **

" బావా ...... ! ఎంత సాహసం చేశావు ఒంటికి కాపడం పెడ్తూ అంది సునీత......

ఆకాష్‌కి వళ్లంతా నెప్పులు..... ఊరంతా చూసారని ఉక్రోషం ...... తనని చూసి వెళ్ళిన అత్త, మామ గుంభనంగా నవ్వటం గుర్తొచ్చిన కొద్దీ మరింత సలపరింత ఎక్కువైంది. " నన్ను సర్‌ప్రైజ్ చేయాలని చిక్కులు పడ్తావా ..... అయినా నీకీ వేషం కట్టమని ఎవరు చెప్పారు మహానుభావా ! ఉడికించింది సునీల్.........

ఆ మాటలకు స్వప్న మీద చెప్పలేని కోసం వచ్చిందతనికి ....... " దాన్ని చంపేస్తాను " మొహం ఎర్రబడగా అన్నాడు...

ఎవరిని ..... బసవన్ననా ........ కవ్వింపుగా అంది.

లేదు .... నా చెల్లెల్ని .... అదే ఈ ప్లాన్ వేసింది..... అట్టర్ ప్లాప్ అయింది..

" పోన్లేండి మీ వేషం పుణ్యమా అని ఊరు ఊరంతా మిమ్మల్ని చూశారు...... అమెరికా అల్లుడికి ...... అమలాపురం కట్టుబాటు తెలిసిందే అంటూ తెగ ముచ్చట పడ్డారు "

మూతి బిగించి నవ్వాపుకుంటూ అంది సునీత.....

" ఏం అమలాపురమో ... అంతా కంపు ..... ఛ .... ఛ... ఒక్క క్షణం ఇక్కడ ఉండొద్దు..... వెళ్ళిపోదాం " కొపంగా అన్నాడు.....

" అలానే " అంది సునీత........

****** ******* ******** ******

ఆకాష్‌కి ఒళ్ళంతా స్వాధీనంలోకి వచ్చేసరికి ఓ వారం పట్టింది....

అత్త... మామలు మర్యాదలు ..... ఊళ్ళో పండుగ సంబరం .... అతనికి జరిగింది మరచిపోయేట్టు చేసింది.

సంక్రాంతి పండుగ విశేషాలు ..... గొబ్బెమ్మలు ...... బొమ్మల పేరంటం గురించి భార్య క్షుణ్ణంగా చెప్తుంటె మనసులో వాటి పట్ల అసహ్యం పక్కకు తొలగింది......

పండుగ మొదటి రోజు ఇద్దరు చెట్టాపట్టాలేసుకుని సంక్రాంతి సంబరాలు తిలకించారు.....

ఎంత జాగ్రత్తగా ఉన్నా .... ఏ మూల నుంచయినా బసవన్న వెంటపడతాడేమో నన్న

భయం ..... అతనికి అమెరికా వెళ్ళేదాకా పోలేదు.........